


# ప్రియురాలు పిలిచె

– డా.యండమూరి వీరేంద్రనాథ్



(ప్రారంభం)

ఉత్తరమంటే శృతిచేసిన వీణలా, ప్రతి అక్షరం మనసుని మీటాలట. బ్రతుకు తీగెమీద మీ జ్ఞాపకం సరిగమలు వాయిస్తోంటే, నేనొక గాఢమైన అలౌకికానందంలో మునిగిపోయి, ఇదిగో ఇన్నాళ్ళకు తేరుకుని ఇలా ఉత్తరం వ్రాయటం మొదలుపెట్టాను.

అప్పుడే రంగులద్దిన తడి తైలవర్ణ చిత్రంలా ఉంటుంది మీ జ్ఞాపకం..! సెలయేరు పెదవి విప్పినట్లు, అలవోకగా పుప్పొడి రాలినట్లు ఉంటుంది మీతో గడిపిన సాయంత్రం..!

ప్రేమంటే ఘనీభవించిన ఒక అసంతృప్తి అనుకుంటా. సూర్యోదయాలూ, చంద్ర దర్శనాలు, శిశిర జీర్ణపత్రాలు, విషాదంలో ఆనందం, ఆనందంలో విషాదం; వెన్నెల్ని కప్పే నల్లమబ్బు, చీకటికి ధవళవర్ణాన్ని ఆపాదించే మంచుతెర – ప్రేమంటేనే ఒక కాంట్రడిక్షన్ కదూ!

ప్రతి కథా ఏదో ఒక పాయింట్ ఆఫ్ టైమ్‌లో ప్రారంభం అవుతుందట. మరి మీ మీద నా ప్రేమ ఎప్పుడు ప్రారంభం అయిందో? తన అక్షరాల్లోకి తానే వెళ్ళి వెతుక్కునే రచయితలా, నేనూ వెళ్ళి శోధించాలి. బదులు తెలియని ప్రశ్నలకి సమాధానం కావాలంటే కాలం తలుపు తట్టాల్సిందే. కానీ ఎంతకాలం ఇలా? ఇక నేనాగలేను. వెన్నెల్లో కరిగిపోయిన ఆడపిల్ల ఆఖరి ఉత్తరానికి, కంటి చివర జాలువారిన ఆఖరి నీటి చుక్క కూడా ఆవిరైపోయింది.

గాలి గాలిగానే ఉంటుంది – వేణువునుంచి రాగమై రవళించేదాకా! నీరు నీరుగానే ఉంటుంది – ఇంద్రధనుస్సుగా విరిసేదాకా! అనుభవం, జీవితం ఇలానే ఉంటాయి – ఆల్కెమీ తెలిసిన మీలాటి మనిషి మనసు తీవెల్ని శృతి చేసేదాకా!!

ఏ దయా పవన గీతికా నయనమో చెమ్మగిల్లి, మనం కలుసుకునే అవకాశం కల్పించటం లేదు. ఏ శీతల చంద్రికా కిరణ హృదయమో కరిగి మన సంయోగాన్ని వాస్తవం చేయటం లేదు.

డియర్ కార్తికేయా,

**వచ్చే మంగళవారం మధ్యాహ్నం ఫ్లయిట్‌లో నేనొస్తున్నాను. తాజ్ ఇంటర్నేషనల్‌లో ఉంటాను. రాగానే ఫోన్ చేస్తాను. ఫోన్ చేసిన అరగంటలో మీరు నా దగ్గర ఉండాలి. మీర్రాకపోతే – సరీగ్గా అరగంట తరువాత హోటల్లోనే ఆత్మహత్య చేసుకుంటాను.**

**- మీ... అనూజ్ఞ**

## అధ్యాయం–1

**వర్షం** వెలిసి దాదాపు గంట అయింది. కొబ్బరాకుమీద నిలిచిన వాన చినుకు, వదల్లేక వదల్లేక ప్రియుడిని వదలిపెడుతున్న ప్రియురాలిలా ఆకుకి వీడ్కోలు చెప్పి నేలకు జారింది. మబ్బు పరదా చాటునుంచి వెన్నెల కుంచెని బయటకు తీసిన చంద్రుడు ఆ బిల్డింగ్ తాలూకు అరిస్టోక్రసీని రెట్టింపు చేసే ప్రయత్నంలో ఉన్నాడు.

బయట అందాల్ని పట్టించుకోకుండా చేతిలోని ఫైల్‌ని తీక్షణంగా చదువుతూ ఉంది శ్రీకళ్యాణి. మానేజ్‌మెంట్ అకౌంటెన్సీ ఆకర్షించినంతగా ఆమెని ప్రకృతి ఆకట్టుకోలేదు. 'మనిషికీ మనిషికీ మధ్య బంధం అనేది పరస్పర అవసరాల కోసం వ్యక్తులు ఏర్పర్చుకునే లౌక్యపు ముడి' అని ఆమె గాఢంగా నమ్ముతుంది. జనరల్ మానేజర్స్ నుంచి వర్కర్ల వరకూ దాదాపు రెండు వేలమంది ఆమె క్రింద వివిధ కంపెనీల్లో పనిచేస్తూ ఉంటారు. కళ్యాణి గ్రూప్ తాలూకు పరిశ్రమల్లో ఉద్యోగం దొరకటం, అక్కడ పని చేయటం చాలామంది అదృష్టంగా భావిస్తారు. శ్రీకళ్యాణి కాటన్ మిల్స్ పది రూపాయల షేరు మార్కెట్లో నూటయాభై పలుకుతోంది.

కళ్యాణి తండ్రి కోటీశ్వరుడు. ఆమె అయిదో ఏట తండ్రి, ఆపై అయిదు సంవత్సరాలకు తల్లీ పోయారు. కళ్యాణి ఆస్తి అంతటికీ ఆమె మేనమామ గార్డియన్ అయి ఆమెని పెంచాడు. చిన్న పిల్లగా ఉండగా మేనమామకి పక్షవాత మొచ్చింది. చాలా సంవత్సరాలు మంచం మీదే ఉండి మరణించాడు. మరణించే రోజు మేనమామ ఆమెని పిల్చి ''అమ్మా, నా అంతం సమీపించింది. (ఆయన దైవభక్తుడు. భాష కూడా అలాగే ఉండేది.) నీ తండ్రి నీ కిచ్చిన ఆస్తిని అలానే నీ కప్పగించి వెళ్ళిపోతున్నాను. అదొక్కటే నాకు సంతృప్తి. సత్యాన్ని (సత్యం అంటే ఆయన కొడుకు) పెళ్ళి చేసుకో అమ్మా'' అన్నాడు.

ఆమె కనుసైగతో డాక్టర్లు, నౌఖర్లు బయటకు వెళ్ళారు. ఆమె అన్నది. ''మావయ్యా! ఇంకొంచెం సేపట్లో నువ్వు కోమాలోకి వెళ్ళిపోతావు. ఆ తరువాత మరణిస్తావు. ఈ చివరి క్షణాల్లో ఒక నిజం చెపుతావా?''

''ఏమిటమ్మా అది?''

''నా వయసు అయిదేళ్ళప్పుడు నేనో దృశ్యం చూశాను. నేను చూసిన ఆ దృశ్యం నిజమా కాదా అన్నది ఇన్ని సంవత్సరాలలో నేను తేల్చుకోలేకపోయాను. అది చెప్పగలిగేది నువ్వే. చెపుతావా?''

''ఏమిటది?''

''ఒక గదిలో మంచం మీద ఒక మధ్య వయస్కుడు పడుకుని ఉన్నాడు. మరో వ్యక్తి అతడి మొహం మీద తలదిండు గట్టిగా నొక్కి పట్టుకున్నాడు. మంచం మీద మనిషి గింజుకుని గింజుకుని చనిపోయాడు...'' అని ఆగి ''అయిదు సంవత్సరాల వయసులో నేను చూసిన ఆ దృశ్యం నిజమేనా మావయ్యా?'' అంది. ఆమె మేనమామ చాలా సేపు మాట్లాడలేదు.

''మరణించే ముందైనా నిజం చెప్పు మావయ్యా. అబద్ధం చెప్పి నన్ను నమ్మించటానికి ప్రయత్నించకు.''

ఆయన కళ్ళు పైకెత్తి నెమ్మదిగా అన్నాడు, 'నీ తండ్రిని చంపింది నేనేనమ్మా!' ఆమె పిడికిళ్ళు మూసుకుని, ఆవేశాన్ని అణుచుకుంటూ ఆమె అలాగే ఉండిపోయింది.

''నన్ను క్షమించు తల్లీ. నేనూ, నా కుటుంబం బికారుల్లా వచ్చి మీ పంచన చేరాం. మీ నాన్నని చంపేసి ఆస్తి మొత్తం స్వంతం చేసుకోవాలనుకున్నాను. కానీ, దేవుడు నాకు బుద్ధి చెప్పాడమ్మా. నా భార్యని తీసుకెళ్ళి పోయాడు. ఎన్నో సంవత్సరాలు పక్షవాతంతో మంచాన పడేశాడు. స్వామి సచ్చిదానంద తీర్థుల వారి సాక్షిగా చెపుతున్నానమ్మా. అందుకే ఆస్తంతా నీ పేర తిరగ వ్రాశాను. నా కొడుకు సత్యానికి ఏమీ మిగుల్చుకోలేదు. ఇప్పుడు నా మనస్సు నిశ్చింతగా ఉంది. ఈ విషయం కూడా నీకు చెప్పేసినందుకు మరింత తేలికైంది. ఎన్నో సంవత్సరాలు పక్షవాతంతోనూ, పశ్చాత్తాపంతోనూ బాధపడ్డాను తల్లీ.''

''ఆస్తంతా నా పేరు మీద మార్చి ఎంతకాలం అయింది మావయ్యా?'' కామ్‌గా అడిగింది.

''గత సంవత్సరమే కళ్యాణీ!''

అవతలివాళ్ళను నమ్మించగలనన్న నమ్మకంతో... సగం నిజానికి... సగం అబద్ధానికి... మంచితనం రేపరు చుట్టిన అతడి వైపు సూటిగా చూసి, ''మరి ఎన్నో సంవత్సరాల్నుంచీ పశ్చాత్తాప పడుతున్నవాడివి, నా ఆస్తి నాకు అప్పగించటానికి క్రితం సంవత్సరం వరకూ ఎందుకు ఆగావు?''

చావు సమీపిస్తూ ఉండటం వల్లనో, ఆ నిజాన్ని తట్టుకోలేక పోవటం వల్లనో గానీ, ఆయనలో జీవకళ తగ్గింది. జవాబు చెప్పలేదు. తిరిగి ఆమె అన్నది. ''కొన్ని సంవత్సరాల క్రితం స్వామి సచ్చిదానంద తీర్థులవారు '...నువ్వు చేసిన పాపం వల్లనే నీకు పక్షవాతం వచ్చిందనీ, ఆ పాప పరిహారం చేసుకుని, దేవుడికి లక్షపత్ర పూజ చేయిస్తే, నీ కాలూ చేయీ స్వాధీనంలోకి వస్తాయి' అని నీకు చెప్పారు. అవునా?''

''ఇది నీకెలా తెలిసిందో గానీ నిజం తల్లీ. ఆ పశ్చాత్తాపంతోనే ఆస్తి నీ పేరున తిరగవ్రాశాను. ఇప్పుడు నా పాపం పరిహారమైంది. స్వర్గం నన్ను పిలుస్తోంది.''

ఆమె చూపులు గునపాలై అతడి గుండె లోతుల్లోంచి నిజాన్ని తవ్వుతున్నాయి. ''పది క్షణాల్లో చావు పెట్టుకుని కూడా నువ్వు మళ్ళీ ఆత్మవంచన చేసుకుంటున్నావు మావయ్యా! స్వామివారు చెప్పిన వెంటనే నువ్వు ఆస్తి నా పేరున వ్రాయలేదు.

అంత ఆస్తి వదులుకోవడం నీకూ కష్టమే కదా! మరో సంవత్సరం పాటు డాక్టర్ల చుట్టూ తిరిగి, ఫలితం లేదని తెలుసుకున్నావు. ఈ లోపులో స్వామివారు ప్రతిరోజూ నీలో పాపభీతి పెంచారు. నిన్ను భయపెట్టారు.''

''ఇది... ఇదంతా... నీ... కె... లా... తెలిసింది?''

ఆమె ముందుకు వంగి, లోతైన గొంతుతో ''దేవుడి భయం నీలో ప్రవేశపెట్టి, నా ఆస్తి నాకు తిరగ వ్రాయిస్తే శ్రీశ్రీశ్రీ సచ్చిదానంద తీర్థ స్వాములవారికి లక్ష రూపాయలు ఇస్తానని ఆశ పెట్టింది నేనే. స్వామివారు కూడా నీలాగే డబ్బుకి అతీతులుకారు మావయ్యా'' అంది.

ఆయన అలానే చూస్తున్నాడు. కన్నార్ప లేదు. ప్రాణం ఎప్పుడు పోయిందో తెలీదు. పక్షవాతం వల్ల పోయిందో, అంత చిన్న వయసులోనే తన మేనకోడలు చూపించిన అపురూపమైన తెలివితేటల్ని చూసిన షాక్ వల్ల పోయిందో గాని, మొత్తం మీద పోయింది.

అంత చిన్నపిల్ల ఒక్కసారి కోట్ల ఆస్తికి తిరిగి వారసురాలు కావటంతో చాలామంది తోక జాడించాలని చూశారు కానీ, కార్మికుల సమ్మె నుంచి, జనరల్ మేనేజర్ల లంచగొండితనం వరకూ వ్యవహారాన్నంతా ఒక్క సంవత్సరంలో ఆమె కొలిక్కి తెచ్చింది. అలా తీసుకు రావటానికి ఆమెకు సహాయపడిన ఒకే ఒక గుణం – 'ఎవర్నీ నమ్మకపోవటం'.

సిగ్మా డిటెక్టివ్ అండ్ సెక్యూరిటీ ఏజెన్సీ వారికి ప్రతి సంవత్సరమూ దాదాపు అయిదు లక్షల రూపాయలు ఫీజుగా చెల్లిస్తుంది. వారి పని, ఆమె తాలూకు వివిధ కంపెనీ ఉన్నతాధికారుల మీద నిఘా ఉంచి, వారి టెలిఫోన్ ట్యాపింగులు, బ్యాంకు అకౌంట్లు, వారి రహస్య జీవితం, అన్నీ ఆమెకు ఎప్పటికప్పుడు తెలియజేయటమే. ఈ రిపోర్టింగ్ కొన్ని సంవత్సరాల్నుంచీ ఎంతో రహస్యంగా జరుగుతూ వస్తోంది. ఒక పారిశ్రామికవేత్తకి అంతకన్నా మరేం జాగ్రత్త కావాలి?

ఇరవై నాలుగేళ్ళు వచ్చేసరికల్లా 'అయాన్‌రాండ్' నవలల్లో పాత్రలా మూర్తీభవించిన I AM OK. YOU ARE NOT OK సైకాలజీతో సరయిన టైమ్‌లో సరయిన నిర్ణయాలు తీసుకునే మేదస్సు అలవర్చుకుంది. మావయ్య హయాంలో కోటి కోటిగానే ఉన్న ఆస్తిని అయిదు సంవత్సరాల్లో అయిదు రెట్లు చేసింది. అందుకే ఆమెకి సిరి కళ్యాణి అన్న పేరు సార్థకమైంది.

మావయ్య పోయిన ఆర్నెల్లకి ఒకరోజు, 'బావా ఈ రోజు మనం డిన్నర్‌కి వెళ్తున్నాం' అని ఆమె సత్యంతో అన్నది.

''నాతో డిన్నరా. నువ్వు నాతో గంట గడపబోతున్నావంటే, అది చాలా ముఖ్యమైన పని అయ్యుండాలి" అన్నాడు సత్యం ఆశ్చర్యంగా.

ఆమె నవ్వి ''ఒక రకంగా అదేలే '' అంది.

నగరంలోకెల్లా ఖరీదైన రెస్టారెంట్ ఎనిమిదో అంతస్తు రూఫ్ గార్డెన్‌లో కూర్చున్నారు ఇద్దరూ. మేనేజర్ ఆమెకి వినమ్రతగా సెల్యూట్ చేసి తప్పుకున్నాడు. పది నిమిషాల్లో డిన్నర్ వచ్చింది. సూప్ తాగుతూ ఆమె సరాసరి విషయంలోకి

దిగింది. ''బావా! ఆర్నెల్ల క్రితం నేను ఆస్తికి వారసురాలినయ్యాను. అప్పటివరకూ 'ఈ ఆస్తంతా నాది' అని నువ్వు అనుకొంటూ ఉండొచ్చు. మావయ్య పోతూ పోతూ ఆస్తంతా నా పేరు మీద వ్రాశాడు.''

''అదేమిటి కళ్యాణీ? అంతకుముందు కూడా ఆస్తి మీ నాన్నదేగా'' అన్నాడు సత్యం.

''అలా అని చెప్పి, మళ్ళీ నాకు ఇవ్వాలని లేదుగా. సర్లే. ఎందుకు ఇచ్చాడో అదంతా ఇప్పుడు అప్రస్తుతం. ఇప్పుడు నీ గురించి చెప్పు. ఆస్తి పోయిందని బాధపడుతున్నావా?''

''అబ్బే, అటువంటిదేమీ లేదు.''

''లేదనుకోవటం ఆత్మవంచన.''

''నిజంగానే అటువంటిదేమీ లేదు కళ్యాణి. నాకు అలాంటి అభిప్రాయమే ఉంటే నిన్ను నా దాన్నిగా చేసుకునే ప్రయత్నమే చేసేవాడినిగా. నువ్వు కాదంటే అది వేరే సంగతనుకో. కానీ, ఇన్నాళ్ళల్లో ఎప్పుడైనా నీ దగ్గర చౌకబారుగా ప్రవర్తించానా? ప్రేమ పాఠాలు చెప్పానా?''

''నీ ప్రవర్తనకి 'మంచి' అన్న సర్టిఫికేట్టు ఇవ్వటానికి నాకేమీ అభ్యంతరం లేదు గానీ, నువ్వు నన్ను చేసుకోకపోవటానికి కారణం మాత్రం అదికాదు'' అంటూ నవ్వింది.

''మరి?''

''నువ్వు ఈపాటికే వేరే అమ్మాయి ప్రేమలో నిండా మునిగి ఉండటం.''

అతడు షాక్ తిన్నట్టు దిగ్భ్రాంతితో ఆమె వైపు చూసి, ''నీకు తెలియని విషయమంటూ ఏమీ లేదా కళ్యాణీ?'' అన్నాడు.

''ఆ విషయం వదిలేసెయ్. అసలు విషయానికి వద్దాం. నాకున్న ఏకైక బంధువ్వి నువ్వు. శ్రీ ఏజెన్సీ నీ పేరు మీద వ్రాయమంటే వ్రాస్తాను. అది దాదాపు పది లక్షల రూపాయలు చేస్తుంది.''

''లా' చదివానే తప్ప, ఆ తలనొప్పి వ్యవహారాలన్నీ నేను పడలేను కళ్యాణి.''

''మరేం చేస్తావ్?''

''నీ లీగల్ వ్యవహారాలన్నీ చూస్తాను. నాకా సామర్థ్యం ఉన్నదనే అనుకుంటున్నాను.''

''సరే అయితే...'' డిన్నర్ ముగిస్తూ లేచింది.

ఆ మరుసటిరోజు అతడిని నెలకు ఇరవైవేల రూపాయల జీతంమీద లీగల్ అడ్వైజర్‌గా నియమిస్తూ ఆర్డర్ ఇచ్చింది. అదీగాక మెయిన్ రోడ్డు మీద ఉన్న పాతికలక్షల విలువచేసే షాపింగ్ కాంప్లెక్సు అతడి పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించి, ఆ కాగితాలు కూడా ఇచ్చింది.

''ఎందుకు కళ్యాణీ యిదంతా?'' అన్నాడు అతడు తడికళ్ళతో.

''మీ నాన్నగారు గార్డియన్‌గా చిన్నప్పటి నుంచీ పెంచినందుకు''

అతడు కాగితాలు తీసుకుంటూ ''అందరూ నిన్ను మెటీరియలిస్టు అంటారు. కాని, చాలా మంది ఫిలాంత్రఫిస్టులకన్నా నువ్వు గొప్పదానివి'' అన్నాడు –

''నన్నెవరూ మోసం చేయకూడదు. నేనెవర్నీ మోసం చేయను' అన్న మనస్తత్వం నాది. రేపు నా వివాహం జరిగాక నా భర్తకి నువ్వంటే ఇష్టం లేకపోవచ్చు. లేదా నేనే నిన్ను ఉద్యోగం లోంచి తీసెయ్యొచ్చు. అప్పుడు కాకుండా ఇప్పుడే నీకు కొంత ఇచ్చేస్తే మావయ్య రుణం తీర్చుకున్నట్టు ఉంటుంది అనుకున్నాను'' అంది మనస్ఫూర్తిగా.

సత్యం తలూపి అక్కడనుంచి వెళ్ళిపోయాడు. అతడి కళ్ళల్లో కృతజ్ఞతా భావాన్ని ఆమె స్పష్టంగా చూసింది. ఒక్కోసారి మన చూపే మనల్ని మోసం చెయ్యొచ్చు. అది వేరే సంగతి.

ఆ తరువాత రెండు రోజులకి సిగ్మా డిటెక్టివ్ ఏజెన్సీ నుంచి ఆమెకు ఉత్తరం వచ్చింది. రహస్య రిపోర్టు పంపించవలసిన వారి లిస్ట్‌లో సత్యం పేరు చేర్చమంటారా అని. ఎందుకంటే ఇప్పుడు సత్యం ఆమెకి లీగల్ అడ్వయిజరు!

శ్రీకళ్యాణి అవసరం లేదని చెప్పింది.

ఒక్కొక్కసారి చిన్న తప్పుకే పెద్ద ఫలితం చెల్లించవలసి ఉంటుంది.

శ్రీకళ్యాణి అపురూపమైన సౌందర్యవతేమీ కాదు. కళ్ళలో తీక్షణతకు తోడు వక్షస్థలం ఎత్తయినదవటంతో, ఆమెలో సహజమైన గ్రేస్ దానంతట అదే కనబడుతుంది. మిగతా అందమంతా విశాలమైన జఘన భాగం, అన్నిటికన్నా ముఖ్యంగా పల్చటి పొత్తికడుపులో ఆమె సన్నటి నడుము నిక్షిప్తమై ఉన్నట్టుగా ఉంటుంది. అందుకే ఆమె ఎక్కువగా చీరెలే కడుతుంది. అందమైన అహంభావం, రొమాంటిక్ ఫిగరూ ఒకే స్త్రీలో ఉండటం అపురూపం. ఈ అపురూపమైన కలయికవల్లే అందం ఎక్కువ లేకపోయినా ఆమె ఆకర్షణీయంగా కనపడుతుంది.

ఆమె వాచీ చూసుకుంది. తొమ్మిదవటానికి ఇంకా రెండు నిముషాలు ఉంది. ఆ రాత్రి సరీగ్గా తొమ్మిదింటికి ఆమె ఒక ఫోన్ మాట్లాడాలి. ఆమె మాట్లాడదల్చుకున్నది ఒక సైకియాట్రిస్టుతో. తనెవరో చెప్పకుండా ఫోన్ చేసి ''మీ కన్సల్టేషన్ ఫీజు ఎంత?'' అనిఅడిగింది.

''డాక్టరుగారు లేరు. మీరెవరు?'' అట్నుంచి అతను అడిగాడు.

''ఆయనతో ఒక గంట మాట్లాడాలి. మీ డాక్టరుగారి ఫీజు చెప్పండి.''

ఆయన ఫీజు చెప్పాడు. ఆమె బ్యాంక్ డ్రాఫ్ట్ పంపింది. దానితోపాటే ''ఈ రోజు రాత్రి సరిగ్గా తొమ్మిదింటికి ఫోన్ చేస్తాను – మీ ఫీజు స్వీకరించండి'' అని చిన్న చీటీ కూడా వ్రాసి పంపింది.

శ్రీకళ్యాణి మళ్ళీ వాచీ చూసుకుంది. సరీగ్గా తొమ్మిదైంది.ఆమె సైకియాట్రిస్ట్‌కి ఫోన్ చేసింది.

''గుడ్ ఈవెనింగ్. మధ్యాహ్నం ఫోన్‌చేసి ఫీజు పంపాను. నేను ఇప్పుడు మీతో మాట్లాడవచ్చా?''

''ఈ రోజు డాక్టర్...'' అని అవతలి వ్యక్తి ఏదో అనబోతూ ఉంటే, మధ్యలో ఆపి ''నాకు మీతో పెద్ద పని లేదు. నేను చెప్పేది వింటే చాలు'' అంది.

''మీరు మధ్యాహ్నం ఫోన్‌చేసి అపాయింట్‌మెంట్ అడిగితే కలుసుకోవటానికేమో అనుకున్నాము. మీరెవరో చెప్పకుండా ఇలా మాట్లాడతారనుకోలేదు.''

''నేనెవరో మీకు తెలియనవసరం లేదనుకుంటాను.''

''క్షమించండి. మీ ఫీజు మీకు వెనక్కి పంపించి వేస్తాము. పేషెంట్ ఎవరో తెలియకుండా మేము ట్రీట్ చెయ్యము.''

''ట్రీట్‌మెంట్ కోసం మీకు ఫోన్ చేయటం లేదు. నేను చెప్పినదంతా విని నాకు సలహా ఇవ్వండి చాలు.''

''కానీ నేను–''

''మీరు నేచెప్పేది వినకపోతే ఇక నా డబ్బు వెనక్కి పంపనవసరం లేదు. మీరే ఉంచుకోండి. లేదా ఏ అనాథ శరణాలయానికో పంపండి''.

''ఇదెక్కడి ఖర్మరా భగవంతుడా'' అనుకున్నట్టున్నాడు అవతలి వ్యక్తి. ఆ మౌనాన్ని గ్రహించినట్టు, 'ఇలాంటి పేషెంటు దొరికిందేమిటి అనుకుంటున్నారా?' అంది శ్రీకళ్యాణి.

''సైకియాట్రిస్ట్ దగ్గరకి ఇంతకన్నా దారుణమైన పేషెంట్లే వస్తారు గానీ, చెప్పండి''.

ఆ మాటలకి కళ్యాణి మొహం ఉక్రోషంతో కందిపోయింది. అయినా అవతలి వ్యక్తి ముసలాయన, మానసిక శాస్త్రవేత్త కాబట్టి కష్టం మీద కోపం అణుచుకుని ''కొన్ని రోజుల క్రితం మా ఇంటి కాంపౌండ్‌లో నేనొక సంఘటన చూశాను డాక్టరుగారూ'' అంటూ చెప్పటం ప్రారంభించింది.

ఆమె నివసిస్తున్న బిల్డింగ్ దాదాపు ఎకరం విస్తీర్ణంలో ఉంటుంది. నౌఖర్ల కోసం క్వార్టర్లు కాక, ఒక మూల డ్రైవర్‌కీ, పెర్సనల్ మానేజర్‌కి ఇళ్ళున్నాయి. ఆ డ్రైవర్ మంచి యవ్వనంలో ఉన్నాడు.

శ్రీకళ్యాణికి తోటలో తిరగటం అంతగా అలవాటు లేదు. కానీ, ఏదైనా సమస్య వచ్చినప్పుడు, లేదా నిద్రపట్టనప్పుడు తోటలోకి వెళ్తుంది. దానికో భావుకత్వం గానీ, సందర్భం గానీ ఉండదు.

ఆ రోజు అలాగే అర్ధరాత్రి సమయాన ఆమె తోటలో తిరుగుతోంటే దూరం నుంచి సన్నటి శబ్దం వినిపించి అటు నడిచింది. మోటార్ బావినుంచి కొబ్బరిచెట్లకు వెళ్ళే నీటి కాలువగట్టు పక్కన ఉన్న పొడవాటి రాయిమీద పడుకుని ఉన్నారు వాళ్ళిద్దరూ..!

డ్రైవర్, పెర్సనల్ మానేజర్ భార్య.

పెర్సనల్ మానేజర్ భార్యకి ఇరవై ఆరేళ్ళుంటాయి. బాగా తెలుపు. అందంగా ఉంటుంది.

అతడామెని దాదాపు కప్పేసాడు. వెన్నెల్లో అతడి శరీరం నల్లగా మెరుస్తోంది. ఆమె యౌవనం అతడి బరువుకి అణిగిపోతోంది. ఆమె తన కాలుని అతడి కాళ్ళ చుట్టు మెలికవేసి, మరింత దగ్గరగా లాక్కోవడానికి ప్రయత్నం చేస్తోంది. అతను కదిలినప్పుడల్లా ఆమె నుంచి వచ్చే సంతృప్తి శబ్దం... దూరానికి వడ్రంగి పిట్ట కూతలా, చిన్నగా వినిపిస్తోంది. అతడి చెయ్యి ఆమె తలకింద ఉంది. మరోచేయి ఆమె కంఠం క్రింది వంపులో ఆడుకుంటోంది. అతడి వేళ్ళు శరీరంమీద కదిలినప్పుడల్లా ఆమె తమకంతో రెచ్చిపోయి, అతడి నడుము మీదుగా చెయ్యివేసి, అతడిని తనకేసి మరింత గట్టిగా హత్తుకుంటూంది.

శ్రీకళ్యాణి అలాగే చీకట్లో నిలబడి ఉంది. ఎదుటి దృశ్యం స్పష్టంగా కనపడుతోంది.

ఇద్దరూ ఒకళ్ళ పెదవుల్తో ఒకరు ఆడుకుంటున్నారు. ఆవేశంతో వరదలా కదిలే ఆమె వేగానికి అందుకోలేక, ఆమెని వదిలేస్తున్నాడు. ఆమె వేళ్ళు అతడి వీపులో గుచ్చుకుంటూ, అంతలోనే తన కడుపు మీదుగా క్రిందికి పాకే అతని చేతుల్ని పక్కకి తొలగించే ప్రయత్నం చేస్తున్నాయి.

పరిసరాలన్నీ నిద్రపోతున్నాయి. శ్రీకళ్యాణి చుట్టూ చూసి, తిరిగి దృష్టి ఆ జంట మీదకి సారించింది. అతడే క్రిందికి వెళ్ళాడో, లేక ఆమె తోసిందో తెలీదు కానీ, ఆమె జుట్టు అతని మొహాన్ని కప్పేసింది. ఆనందపుటంచులమీద నిలబడి ప్రపంచాన్ని మర్చిపోయినట్టు ఉన్నారు ఇద్దరూ. ఆమె వెన్నెముక ఆఖరి అంచు వంపులో చంద్రకిరణం లయబద్ధంగా కదుల్తోంది.

ఆమె చప్పుడు చేయకుండా వెనక్కి వచ్చేసింది. శరీరంలో ఏదో తెలియని ఆవేశమూ, రచయితలు వ్రాసేట్టూ, నైటీ నేల మీదకు జార విడిచి బలంగా వళ్ళు విరుచుకోవాలని అనిపించటమూ, అద్దంలో చూసుకోవాలనిపించటమూ లాంటిదేమీ అనిపించలేదు. పదహారేళ్ళ వయసులోనే ఆమెకు ఒక మార్వాడీల అమ్మాయి స్నేహితురాలుండేది. వాళ్ళింట్లో ఒకటి రెండు బ్లూ ఫిలిమ్స్ చూసింది. తరువాత నచ్చక మానేసింది. తనకూ త్వరలోనే పెళ్లవబోతుందనీ, ఇవన్నీ తనూ అనుభవించబోతున్నానని ఆమెకు తెలుసు. అయినా ఆమె ప్రపంచం అది కాదు.

''ఇంతకీ మీ సమస్య ఏమిటి?'' ఫోన్‌లో ఆమె చెప్పినదంతా విని అడిగాడు.

''ఆ విషయానికే వస్తున్నాను.''

''చెప్పండి''

''మా పెర్సనల్ మానేజర్‌కి చాలా పన్లుంటాయి. ఎప్పుడూ ఊళ్ళు తిరుగుతూ ఉంటాడు.''

''అయితే?''

''మా డ్రైవర్ భార్యకి ఆర్థరైటిస్. సాధారణ ఇంటి పనే కీళ్ళనొప్పుల్తో విసుక్కుంటూ చేస్తుంది. డాక్టరు గారూ. ఇప్పుడు నేను అసలు విషయానికి వస్తాను. మొన్న రాత్రి నేను చూసిన దృశ్యంతో వాళ్ళిద్దరి మీదా నాకు కోపం రావాలి. 'ఇద్దరు పిల్లల

తల్లి ఇలా చేస్తుందా? ఇంట్లో భార్యని ఉంచుకుని ఇంకో స్త్రీతో తిరుగుతాడా' అనిపించాలి.

నాకలా అనిపించలేదు. 'మా పెర్సనల్ మానేజర్‌కి డబ్బు సంపాదనే ఆనందం. కాబట్టి అతడి భార్య తన ఆనందం కోసం మరో దారి చూసుకుంది. ఆ అవకాశాన్ని మా డ్రైవర్ ఉపయోగించుకున్నాడు. మొత్తానికి ముగ్గురూ ఆనందంగానే ఉన్నారు' అని అనుకున్నాను. నేనిలాటి మనస్తత్వం కలిగి ఉండటం ఏదైనా విపరీతానికి దారి తీస్తుందా? భవిష్యత్తులో నన్ను కష్టపెడుతుందా? నేనేదైనా సైకలాజికల్ ట్రీట్‌మెంట్ తీసుకోవాలా? చెప్పండి డాక్టర్ గారూ''

అట్నుంచి కొంచెంసేపు నిశ్శబ్దం. ''మీ సమస్య నాకర్థమైంది.''

''థాంక్స్''

''మీ సమస్యకి పరిష్కారం చెప్పటానికి సైకియాట్రిస్ట్ అవసరం లేదు. జీవితంపట్ల నిజాయితీ ఉన్న మనిషి చాలు.''

ఆమె మాట్లాడలేదు. ఆయన తనలో తనే ఆలోచించుకుంటున్నట్టుగా కొంచెం సేపు ఆగి – ''మీరెవరో చెప్పటం మీకు ఇష్టంలేదు. ఎందుకు?'' అని అడిగాడు.

''అది అంత అవసరం కాదనుకుంటాను డాక్టరుగారూ. కేవలం నా మనస్తత్వపు విపరీత ధోరణుల గురించి తెలుసుకోవటానికే ఈ ఫోను. మీ ఫీజు ఆల్రెడీ...''

''నా ఊహ కరెక్టవుతే మీకు తల్లీ తండ్రీ లేరు. ఆప్యాయతకు నోచుకోలేదు.''

ఆమె జవాబు చెప్పలేదు.

''మీకు చిన్నతనంలోనే ఏదో మోసం జరిగి ఉండాలి. మీకు బాగా డబ్బు ఉండి ఉండాలి. అందరూ మిమ్మల్ని మోసం చేస్తున్నారన్న భావం మీలో బాగా పాతుకుపోయింది. మీరు మీ అడ్రసు, వివరాలు ఇవ్వకపోవటానికి కారణం కూడా ఊహించగలను. సెక్సుపరమైన ఇటువంటి దృశ్యాన్ని మీరు తేలిగ్గా తీసుకోవటం చూసి, నేను కూడా మీ మీద 'ఉత్సాహం' చూపించి ట్రై చేస్తానేమో అని మీ అనుమానం! మీ మానసిక శాస్త్రవేత్త మీద కూడా మీకు నమ్మకం లేదు.''

ఆమె దీనికి కూడా జవాబు చెప్పలేదు గానీ మనసులోనే అతని తెలివితేటలకు ఆశ్చర్యపోయింది. కరెక్టుగా ఆమె అలాగే అనుకుంది.

ఆయన అన్నారు. ''మీ జబ్బు పేరు కార్లోసర్కోమా ఆఫ్ మెడ్యూలా సిండ్రోమ్. మానవ సంబంధాలన్నీ స్వార్థపూరితమేనన్న మీ మనస్తత్వానికి ఒకే ఒక మందు ఉంది''.

''ఏమిటది?''

''మానసిక శోభనం... అంటే మీ మనసుతో మీరు రమించటం. అంటే ప్రేమించటం అన్నమాట!''

ఆమె మొహం ఎర్రబడింది. ఆయన నిజంగానే అంటున్నారో ఏడిపించడానికి అంటున్నారో తెలియలేదు. ఆయన వయసు దాదాపు యాభై అయిదు ఉంటుందని మాత్రం తెలుసు.

ఈ లోపులో ఆయన అన్నారు. ''మీ మానేజర్ ఊళ్ళు తిరుగుతూ 'ఆనందిస్తున్నాడని' మీరన్నారు. అతడు ఆనందిస్తున్నాడని మీరెలా అనుకున్నారు? ఇంటిల్లిపాదినీ పోషించటానికి అతను కష్టపడుతున్నాడు. అతడిలో స్వార్థం లేదు. అతడి భార్య మీ డ్రైవర్‌తో ఆనందం అనుభవిస్తుందన్నారు. అంటే... ఆమె తన భర్తని ప్రేమించటం లేదన్నమాట. కేవలం సెక్యూరిటీ కోసం అతనితో ఉంటూ, అతడి తిండి తింటూ, తను ఆనందిస్తోంది.''

శ్రీకళ్యాణి అతడు చెప్పేది జాగ్రత్తగా వింటోంది. ''మీ ఫ్యాక్టరీలో పనిచేస్తూ మీ రహస్యాలు మీ ప్రత్యర్థికి అమ్మే వ్యక్తి మీద ఎంత కోపం వస్తుందో, మీకు ఆమె మీద అంత కోపం రావాలి! అలా రాలేదంటే మీకూ సెక్సు పట్ల అంతర్గతంగా విపరీతమైన ఇంటరెస్టు ఉండి ఉండాలి. పాతికేళ్ళు వచ్చినా బహుశ మీకు పెళ్ళయి ఉండదు.''

ఆమె కోపంగా ఏదో అనబోయి తమాయించుకుంది. అతనన్నాడు. ''మీ వాదనే కరెక్టయితే, రేప్రొద్దున్న మీ డ్రైవర్ మీ దగ్గరకొచ్చి, 'ఇద్దరం ఖాళీగా ఉన్నాం, సరదాగా ఎంజాయి చేద్దాం రా' అంటే దాని వల్ల ఇద్దరికీ లాభమే తప్ప నష్టం లేదు కాబట్టి మీరు ఒప్పుకోవాలి. అంతేగా మీ వాదన?''

''షటప్'' గది పై కప్పు లేచిపోయేలా అరిచి ఫోన్ విసురుగా పెట్టేసింది. ఆమెకు ఊహ తెలిసిన తరువాత ఆమెని ఎవరూ అంతగా అవమానించలేదు. కనీసం అలా మాట్లాడే ప్రయత్నం కూడా చేయలేదు.

(కొనసాగింపు వచ్చే నెలలో)

Click here to share your comments